క్లుప్తంగా

విద్యా సంస్థల్లో ఉగాది వేడుకలు



లక్ష్మీ నరసింహంను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ విద్యా సంస్థల్లో శనివారం ఉగాది ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మైలవరపు లక్ష్మీ నరసింహం పంచాంగ శ్రవణం చేశారు. ఆయన్ని కళాశాల ప్రతినిధులు సత్కరించారు. పి.రమ్య బృందం ప్రదర్శించిన కోలాట నృత్యాలు, విద్యార్థినులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి.

- రామచంద్రరావు పేట శర్వాణి హైస్కూల్లో ఉగాది వేడుక నిర్వహించారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సత్య శారద, పాఠశాల డైరెక్టర్ మదన్ మోహన్ రాజు పాల్గొన్నారు.

సోమా ఇంజినీర్‌కి మరో అవార్డు



అవార్డు అందుకుంటున్న ఇంజినీర్ తేజ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సోమా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టింగ్‌కు చెందిన ఇంజినీర్ సూరత్తు తేజను మరో అవార్డు వరించింది. తేజ రూపొందించిన షకినాస్ ట్రూ లైఫ్ హాస్పిటల్ నిర్మాణానికి అందించిన ప్లాన్ ఐసీఐ అల్ట్రాటెక్ అవార్డ్స్-2024లో ఔట్‌స్టాండింగ్ కాంక్రీట్ స్ట్రక్చర్-- మర్షియల్ అవార్డుకు ఎంపికైంది. ఇటీవల విశాఖపట్నంలో ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఇంజినీర్లు, ఇంజినీరింగ్ సంస్థలు శుభాకాంక్షలు తెలిపాయి.

పాఠశాలలో పనిచేయని ఆర్‌ఓ సిస్టం

దెందులూరు: చాటపర్రు ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ సిస్టం పనిచేయకపోవడంతో 400 మంది విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం రూ.4.80 లక్షలతో ఆర్‌ఓ ప్యూరిఫైయర్ సిస్టం ఏర్పాటు చేశారు. ఈ సిస్టం పనిచేయకపోవడంతో ఇటీవల స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే 10 వాటర్ టిన్నులు నిత్యం ఉన్నత పాఠశాలకు పంపుతున్నారని బాత్‌రూమ్, ఇతర అవసరాలకు పంచాయతీ పంపు నీరు వస్తుందని ప్రధానోపాధ్యాయురాలు వివరించారు. తక్షణమే ఆరోఓ సిస్టంను వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నగరంపై డ్రోన్ల నిఘా

- ఏలూరులో రాత్రివేళల్లోనూ పర్యవేక్షణ
- నేరస్తుల గుండెల్లో గుబులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం, చుట్టపక్కల ప్రాంతాల్లో తుప్పల్లో, చాటుమాటుగా నేరాలకు పాల్పడే వ్యక్తులకు డ్రోన్ల ఫీవర్ పట్టుకుంది. డ్రోన్లు రాత్రివేళల్లోనూ ఆకాశంలో రయ్యిమంటూ విహరిస్తూ, ఆయా ప్రాంతాల్లో ఏం జరుగుతుంతో వీక్షిస్తూ, వీడియోలు, ఫొటోలు తీస్తున్నాయి. జూదగాళ్లు, నేరగాళ్లకు డ్రోన్స్ సింహస్వప్నంగా మారుతున్నాయి. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణలో డ్రోన్ల నిఘా సత్ఫలితాలను ఇస్తుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

డ్రోన్ల విహంగ వీక్షణం

ఏలూరు నగరంలో డ్రోన్ నిఘా వ్యవస్థ కొనసాగుతోంది. గత కొంతకాలంగా ఏలూరులో సుమారు 10కి పైగా డ్రోన్లు విహంగ వీక్షణంతో నేరస్తుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. నగరంలో ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణతోపాటు, అభయ మహిళా రక్షక దళాలకు అండగా డ్రోన్స్ టీమ్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నగర ప్రధాన రహదారుల్లో యువతులు, విద్యార్థినులు కాలేజీల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రాంతాల్లో డ్రోన్ల నిఘా ఉంచుతున్నారు. ఈవ్ టీజర్లు అటకట్టించేలా ఒకవైపు అభయ పోలీస్ రక్షక టీమ్స్ ఉండగా, మరోవైపు డ్రోన్స్‌తో మానిటరింగ్ చేస్తున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఏ విధంగా ఉంటుంది, రద్దీని నియంత్రించేందుకు సైతం పోలీసులు డ్రోన్స్ కెమెరాలతో తక్షణ చర్యలు చేపడుతున్నారు.



ఏలూరు ప్రధాన రహదారుల్లో డ్రోన్ పర్యవేక్షణ

జూదరులకు చెక్

ఏలూరు నగర విస్తరణతో పోలీస్ అధికారులకు నేరస్తుల కదలికలను గుర్తించటం సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ, డీఎస్పీల ఆధ్వర్యంలో డ్రోన్లతో నిత్యం నిఘా ఉంచుతున్నారు. నగరం పరిసర ప్రాంతాలైన చొదిమెళ్ల, శనివారపుపేట, వట్లూరు, బీడీ కాలనీ, కంద్రికగూడెం, ఆర్‌టీవో ఆఫీస్ కార్యాలయం, మాదేపల్లి, గ్రీన్‌సిటీ, పెదపాడు రోడ్డు, కొత్తూరు జూట్‌మిల్లు ఇలా ప్రతి ప్రాంతంలోనూ మూడో కన్ను ఉంది. తుప్పల్లో, చెట్లలో, ఊరు శివారులో, ఇంటి డాబాలపైనా పేకాట, కోడిపందాలు వంటివి ఆడేందుకు సైతం జూదరులు భయంతో వణుకుతున్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం



జిల్లా కేంద్రం ఏలూరులో నేరాల నియంత్రణకు డ్రోన్లతో నిఘా పెట్టాం. ఒకవైపు పోలీస్, మరోవైపు డ్రోన్ల నిఘాతో మంచి ఫలితాలు రాబట్టేందుకు చర్యలు చేపట్టాం. మహిళలు, విద్యార్థినులకు ఈవ్ టీజర్లు, నేరాలకు పాల్పడే వ్యక్తుల నుంచి రక్షణకు కాలేజీలు, స్కూల్స్ వదిలే సమయంలో డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నాం. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే తక్షణమే వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేసేలా చర్యలు చేపట్టాం.

– డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ

జిల్లా పోలీస్‌కు డ్రోన్స్, సీసీ కెమెరాలు

ఏలూరు టౌన్: జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేస్తోందని ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ముదినేపల్లి మండలం సంగరాయపాలెం గ్రామంలోని గ్రోవెల్ ప్రాసెసర్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా డ్రోన్స్, సీసీ కెమెరాలను ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కంపెనీ డైరెక్టర్లు చింతపల్లి సుధీర్, పొట్లూరు శ్రీనివాస్ చేతులమీదుగా సూర్యచంద్రరావుకు అందజేశారు. రూ.16,04,800 విలువైన రెండు డ్రోన్స్, రూ.8.85 లక్షల విలువైన 100 సీసీ కెమెరాలను అందించారు. కార్యక్రమంలో గ్రోవెల్ ప్రాసెసర్స్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు హెచ్ఆర్ ప్రతిమ, జనరల్ మేనేజర్ సిద్ది లింగేశ్వర్‌రావు, ఫైనాన్స్ మేనేజర్ పి.శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఐటీకోర్ ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ నరేంద్ర, పోలీస్ అధికారులు, కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.



ఏఎస్పీకి డ్రోన్స్, సీసీ కెమెరాలు అందిస్తున్న కంపెనీ డైరెక్టర్లు

ప్రజల్లో చైతన్యం కలిగించాలి

ఏలూరు (టూటౌన్): నీరు, రవాణా, పోస్టల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విద్య, వైద్యం, రియల్ ఎస్టేట్, విద్యుత్ తదితర విభాగాల సేవల్లో లోపం ఉన్నా పర్మినెంట్ లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఏసీ) ఎం సునీల్ కుమార్ అన్నారు. దీనిపై పారా లీగల్ వాలంటీర్లు ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. ఏలూరు పరిధిలోని పారా లీగల్ వాలంటీర్లు, ప్రజా ప్రయోజన సేవల కార్యాలయ (పర్మినెంట్ లోక్ అదాలత్) సిబ్బందికి అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల కార్యాలయం పని విధానం, కేసులు దాఖలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజా ప్రయోజన సేవల చైర్ పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ 2023 నుంచి ఇక్కడ ఈ కార్యాలయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పనిచేస్తుందని, ఇప్పటి వరకు ఈ కార్యాలయంలో 232 అర్జీలు దాఖలు చేయగా 20 కేసుల్లో తీర్పులు వెలువరించారని తెలిపారు. రూ.2,36,22,800ను కక్షి దారులకు పరిహారంగా ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్, ఇన్‌చార్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులి కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీల్‌కుమార్

వృద్ధులకు దుస్తుల బహూకరణ

ఏలూరు (టూటౌన్): జన్మనిచ్చిన తల్లిదండ్రుల రక్షణ, సంరక్షణ బాధ్యత బిడ్డలపై ఉందని బాలవికాస్ భారతి అధ్యక్షుడు, న్యాయవాది కట్టా సత్యనారాయణ అన్నారు. స్థానిక ఐద్వా జిల్లా కార్యాలయంలో వాసవి సుబ్బారావు సీతారాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారావు సహకారంతో ఉగాదిని పురస్కరించుకొని వృద్ధ మహిళలకు దుస్తులు శనివారం సాయంత్రం బహూకరించారు. వద్దులు - కుటుంబం - సమాజం - బాధ్యత అంశంపై సభ నిర్వహించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే శిక్షార్హులవుతురని సుబ్బారావు అన్నారు. వృద్ధులు, పిల్లల కోసం తమ ట్రస్టు ద్వారా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మానవత ఏలూరు నగర అధ్యక్షురాలు పోదరి కనకదుర్గ, వల్లూరిపల్లి సాయి సుధా, మానవత కార్యదర్శి అల్లూరి మోహిని, వీజీఎంవీఆర్ కష్టారావు, శొంఠ్యాల కస్తూరి రావు, కూచిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

ఏలూరు (టూటౌన్): విజయవాడలో ఆదివారం నిర్వహించే పీ-4 ప్రారంభ కార్యక్రమానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏలూరు కార్పొరేషన్ నుంచి 131 మంది సచివాలయ సిబ్బందిని ఎంపిక చేశారు. వీరంతా ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారే కావడంతో ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఎంపికలో వివక్షత చూపడంపై ఉద్యోగులు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, ఎమ్మెల్యే బడేటి చంటి దృష్టికి తీసుకెళ్లారు. ముందు ఇచ్చిన ఆర్డర్లను మార్చాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు.

ఆర్డర్ల మార్పు

పీ4 ప్రారంభ కార్యక్రమానికి ముందుగా ఏలూరు నగరపాలక సంస్థ నుంచి 131 మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను మాత్రమే ఎంపిక చేశారు. వీరందరినీ విజయవాడ బస్సులలో తరలించేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే ఉద్యోగుల్లో నిరసన వ్యక్తం కావడంతో ఉదయం ఇచ్చిన ఆర్డర్‌ను సాయంత్రానికి మార్చి అందరూ వచ్చే విధంగా మరో ఆర్డర్‌ను విడుదల చేశారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

79 సచివాలయాలు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న 79 సచివాలయాల్లో 600 మంది వరకు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కులం, మతం పేరుతో ఉద్యోగులను విభజించి ఆదివారం విజయవాడలో జరిగే పీ4 ప్రారంభ కార్యక్రమానికి ఎంపిక చేయడం ఎంత వరకు సమంజసం అంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉగాది అనేది కొందరికేనా తమకు ఉండదా అంటూ నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు.

నేడు నగరంలో ఉగాది వేడుకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో పలు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. హిందూ యువజన సంఘం 121 వసంతాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6.15 గంటలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నృత్య రూపకాల ప్రదర్శన, వేద స్వస్తి, పంచాంగ పఠనం కార్యక్రమాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సాహిత్య మండలి ఆధ్వర్యంలో రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడుపల్లి మోహన గుప్త, పుల్లాభొట్ల పురుషోత్తమ రావు తెలిపారు. స్వాగత నృత్యం, పంచాంగ శ్రవణం, అనంతరం ప్రముఖ నేత్రావధాని కాశీభొట్ల రమాకుమారికి శ్రీ పుల్లాభొట్ల శ్రీరామమూర్తి స్మారక సాహిత్య పురస్కార ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

దానధర్మాలకు ప్రతీక రంజాన్

ఐదున్నర దశాబ్దాలుగా పేదలకు వితరణ

చింతలపూడి: ధనిక, పేద తారతమ్యం లేకుండ ప్రతి పేద ముస్లిమూ సంతోషంగా రంజాన్ పండుగ నిర్వహించుకోవాలన్నదే ఇస్లాం ప్రబోధం. పేదలకు సాయం చేయాలన్న సంకల్పంతో రంజాన్ మాసంలో అంజుమన్ మహఫిజుల్ ఇస్లాం కమిటీ, జమా అతె ఇస్లామి హింద్‌లు సంయుక్తంగా ఐదున్నర దశాబ్దాలుగా క్రమం తప్పకుండా ఏటా పండుగ సరుకులు పంపిణీ చేస్తున్నారు. జమా అతె ఇస్లామీ హింద్‌కు విరాళాలు, జకాత్, ఫిత్రాల రూపంలో వచ్చే సొమ్ముతో జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం, కొత్తపల్లి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన వందలాది పేద ముస్లిం కుటుంబాలకు ఏటా కొత్త దుస్తులు, పండుగ సరుకులు అందజేస్తుంది.

సంపదలో కొంత దానం

ముస్లింలకు నమాజ్, రోజా ప్రకారమే జకాత్ కూడా నిర్ణయమవుతుంది. దైవం కోసం, దైవ ప్రసన్నత పొందడానికి ఒక బాధ్యతగా సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. సంపద అంటే బంగారం, వెండి, పాడి పశువులు, నగదు, పంటలు, వ్యాపార సామగ్రి, మొదలైనవి వస్తాయి. నిరుపేదలకు, రుణగ్రస్తులకు రుణభారం నుంచి విముక్తి చేయడానికి, ధర్మ ప్రచారానికి, పేద, ధనిక అంతరాలను రూపు మాపడానికి జకాత్ తోడ్పడుతుందని నమ్ముతారు. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేది అని అర్థం. పేదలకు దానం చేయడాన్ని కూడా జకాత్ అంటారు. ముస్లింలకు విధించిన ఐదు ప్రాథమిక విధుల్లో జకాత్ ఒకటి. ఇలా రంజాన్ నెలలో జకాత్ చేయడం దేవునికి కృతజ్ఞతలు తెలుసుకోవడంలో భాగమని భావిస్తారు. తొలుత దగ్గరి రక్త సంబంధీకులకు ఇస్తారు. దగ్గరి బంధువులు ఆకలితో అలమటిస్తూ ఉంటే వారికి దానం చేయకుండా ఇతరులకు జకాత్ ఇస్తే అది చెల్లదని ఖురాన్ చెబుతోంది. ఆతరువాత ఇతర బంధువులు, స్నేహితులు, గ్రామంలోని పేదలకు ఇవ్వాలి. జకాత్‌లో భాగంగా పేదలకు పండగ సరుకులు, కొత్త దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తారు. సాధారణ జీవితానికి మించి ఆదాయ వనరులు ఉన్నవారు తప్పనిసరిగా జకాత్ చెల్లించాలి. తమ వద్ద అదనంగా ఉన్న ప్రతి రూ.100కు రూ.2.50 వంతున లెక్కించి చెల్లించాలి. జకాత్ మొత్తాన్ని రంజాన్ పండుగ నమాజ్‌కు ముందు రోజే పేదలకు చెల్లించాలి.



చింతలపూడిలో ముస్లింలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దశ్యం

పస్తులు ఉండకూడదు



పండగపూట ఏ ఒక్కరూ పస్తులు ఉండకూడదు. ఆకలి విలువ తెలియజేసేదే రంజాన్ ఉపవాస దీక్ష. ప్రతి ముస్లిం చుట్టుపక్కల ఉన్న పేదలకు చేతనైన సాయం చేయాలి. మనతో పాటు సంతోషంగా అందరూ పండుగ జరుపుకునేలా దాన ధర్మాలు చేయాలి.

– ఎస్‌కె ఆజాద్‌బాబు, అజీమ్ చారిటీ చైర్మన్

70 రెట్లు అధికంగా పుణ్యం



రంజాన్ మాసంలో చేసే దాన ధర్మాలకు 70 రెట్లు అదనంతా పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం విధిగా జకాత్ చెల్లించాలి. ఐదున్నర దశాబ్దాలుగా వందలాది మంది పేద ముస్లిం కుటుంబాలకు కొత్త దుస్తులు, పండగ సరుకులు అందచేస్తున్నాం.

– ఎండీ అక్బర్ అలి, చింతలపూడి జమాతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	బీన్సచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	48
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	76
కాకర కాయలు	28-36	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24-30	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	06
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	07
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	రద్దు
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	18
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

దుర్గమ్మకు విశేష అభిషేకాలు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక బావిశెట్టివారి పేట కనక దుర్గ ఆలయంలో అమావాస్య సందర్భంగా శనివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం 108 లీటర్ల ఆవుపాలు, పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఏలూరుకు మూడు కళారత్నలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ముగ్గురికి ఒకే ఏడాది కళారత్న అవార్డులు లభించడం విశేషమని స్థానిక గరికపాటి ఆర్ట్స్ థియేటర్ అధినేత గరికపాటి కాళిదాసు, గురు ఇంజినీర్స్ అధినేత ఎంవీఆర్ఎస్ శర్మ (గురు శర్మ), సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం, హేలాపురి కళాకారుల సంఘం ప్రతినిధి ఎండీ ఖాజావలి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నంది అవార్డు గ్రహీత సినీ విజ్ఞాన విశారద ఎస్‌వీ రామారావుకు కళారత్న అవార్డు, 45 ఏళ్లుగా నాట్య రంగంలో విశేష సేవలందిస్తున్న నాట్య విదుషి మణిగా పేరుగాంచిన పార్వతీ రామచంద్రన్‌కు హంస, కళారత్న అవార్డు, దేశ విదేశాల్లో పేరుగాంచిన హరికథ కళాకారిణి సప్పా భారతి భాగవతారిణికి కళారత్న అవార్డు రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఆమె తాగునీటి సమస్య పరిష్కారంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈతో కలిసి సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీలు, వర్షాభావ ప్రాంతాల్లో బోర్లు తవ్వించాలని, చెట్టున్నపాడు, ఆగడాలలంక, మల్లవరం గ్రామాల తాగునీటి సమస్య దీర్ఘకాలిక పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని పద్మశ్రీ ఆదేశించారు.

రసాభాసగా టీడీపీ ఆవిర్భావ వేడుక



వాగ్వివాదానికి దిగిన టీడీపీ శ్రేణులు

టి.నరసాపురం: టి.నరసాపురంలో టీడీపీ ఆవిర్భావ వేడుక శనివారం రసాభాసాగా సాగింది. నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేధాలు మరోసారి తెరపైకి వచ్చాయి. టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో ఉన్న పార్టీ జెండా వద్ద ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడానికి టీడీపీ నాయకులు సన్నాహాలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎంపీ పుట్టా మహేష్ ఫొటో లేకపోవడంతో ఒక వర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఇది తీవ్ర స్థాయికి చేరి తోపులాటకు దారి తీసింది. అక్కడ పెట్టిన ఫ్లెక్సీని తొలగించడంతో గొడవ సర్దుమణిగింది. ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇరువర్గాలు పాల్గొన్నాయి.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

గణపవరం: ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. శనివారం ఆయన గణపవరం మండలం పిప్పర, కేశవరం గ్రామాలలో పాఠశాలలను సందర్శించి, తనను గెలిపించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పిప్పర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏబకాయిలన్నీ చెల్లించాలని, కొత్త పీఆర్సీ తక్షణం ఏర్పాటు చేయాలని, పాఠశాలల విలీనం ప్రక్రియలో ఉపాధ్యాయుల అభిప్రాయాలమేరకే ముందుకెళ్లాలని, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించి బోధనకు సమయం ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు ఏసమస్య వచ్చినా తాను వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు విజయరామరాజు, సీనియర్ నాయకుడు హోతా ఆంజనేయులు, మండల బాధ్యులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం నుంచి మట్టిని తరలిస్తే చర్యలు

దెందులూరు: దెందులూరు మండల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న పోలవరం కుడి కాలువ గట్టు, దాని సంబంధిత ప్రదేశాలలో ఉన్న మట్టిని అనుమతులు లేకుండా తవ్వినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఆర్ శివాజీ హెచ్చరించారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ గట్టు మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వాహనాలపై సైతం రవాణా యాక్ట్‌ను అమలు చేస్తామని హెచ్చరించారు. పోలవరం కాలువ ప్రాంతమంతా పూర్తిస్థాయి నిఘా పెట్టామన్నారు. మట్టి తరలిస్తే సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.